www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 అక్టోబర్ 2023

5

కాకినాడ



పలు రైళ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి-కాకినాడ

గత కొన్ని నెలలుగా రద్దు చేసిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-విశాఖపట్నం ఎంటిఎస్, మచిలీపట్నం-విశాఖపట్నం రైళ్లను రైల్వే శాఖ పునరుద్ధరించినట్టు కాకినాడ ఎంపీ వంగా గీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల వల్ల గత కొన్ని నెలలుగా వీటిని రద్దు చేయడంతో ప్రయాణికులు, ముఖ్యంగా పేదవర్గాల ప్రయాణికులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగస్తులు ఇబ్బందులకు గురయ్యారని ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తాను తీసుకెళ్లినట్టు ఎంపీ తెలిపారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి రైళ్లను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. వీటిని ఈ నెల 16, 17, 18 నుంచి నడిపేందుకు రైల్వేశాఖ నిర్ణయించిందన్నారు.

ఊసే లేని ఈ-విక్రయాలు

- రెండేళ్ల క్రితం ప్రారంభించిన ప్రభుత్వం
- ప్రస్తుతం ఊసెత్తని వైనం
- ఆన్‌లైన్‌లో నమోదు కాని పంటలు



పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతులు పండించిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడంతోపాటు మంచి ధర కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-విక్రయాలు (ఈ-ఫామ్ మార్కెటింగ్) రెండున్నరేళ్ల క్రితం ప్రారంభించింది. తొలి రోజుల్లో జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీల్లో మొక్కుబడిగా ప్రారంభించి వదిలేశారు తప్ప ఒక్క రూపాయి విలువైన ఉత్పత్తిని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోలేదు. రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ కార్యక్రమం మధ్యలో నిలిచి పోయింది. అప్పటి నుంచి విక్రయాల ఊసెత్తడం లేదు. ఈ విధానంలో రైతులు పండించిన వివిధ పంట ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా వ్యాపారులు కొనుగోలు చేస్తారు. సొమ్ము చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. రైతులు పండించిన పంటలు దేశంలో ఏ మార్కెట్‌లోనైనా అమ్ముకునే వీలును కల్పిస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం 'ఈ-నామ్' ప్రవేశపెట్టింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అప్పట్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కొత్తపేటలో మాత్రమే ఈ విక్రయాలు జరుపుతున్నారు. ఈ మార్కెట్లలో రైతులు వారి పంటను ఏ వ్యాపారికైనా అమ్ముకునే అవకాశం కల్పించారు. వ్యాపారులు ఆన్‌లైన్‌లో చూసి వారికి నచ్చిన ఉత్పత్తిని కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు సైతం ఎప్పటికప్పుడు ఇతర మార్కెట్లలోని పంట ఉత్పత్తుల ధరల సమాచారాన్ని సులువుగా తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది.

జిల్లాలో కాకినాడ అర్బన్, కరప, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో 9 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. సామర్లకోట మినహా 16 చోట్ల చెక్ పోస్టులు పని చేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు, పశు గణాంకాలపై లైసెన్స్ వర్తకులు, చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ ఫీజు ఈ ఏడాది వసూలు లక్ష్యం రూ.3630.00 లక్షలుగా నిర్ధేశించి ఇప్పటి వరకు రూ.606.39 లక్షలు వసూలు చేసారు. నాలుగు చోట్ల 15055 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల 16 గోదాములున్నాయి.

దళారులకే అమ్మకాలు

జిల్లాలో వరి ఎక్కువగా పండుతుంది. అపరాలు, పత్తి, పచ్చిమిర్చి, కూరగాయలు, బొప్పాయి, వేరుశనగ తదితర పంటలు పండించే రైతులు కూడా ఉన్నారు. ప్రధానంగా పత్తి పంటకు గిట్టుబాటు ధర రాని పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోవడంతో చివరకు వివిధ ఉత్పత్తులను దళారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ విక్రయాలు గనుక కొన్ని మార్కెట్ కమిటీల్లో జరిగితే రైతులకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉండేది. ఈ విధానం ప్రకారం రైతులు దగ్గర సిద్ధంగా ఉన్న పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటారు. సంబంధిత పంటల ఉత్పత్తులు కొనుగోలు చేయాలనుకునే వ్యాపారులు కూడా ఆన్ లైన్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా తమ అవసరాలకు ఉపయోగపడే వ్యవసాయోత్పత్తులను పరిశీలించి వ్యాపారులు ధరను కోట్ చేస్తారు. ఆ ధర రైతుకు నచ్చితే విక్రయించుకోవచ్చు. ఈ ప్రక్రియ అంతా వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా జరగాలి. జిల్లాలో ఆరంభం శూరత్వం మాదిరిగా మొక్కుబడిగా ప్రారంభించారు తప్ప నేటికీ కొనుగోళ్లు చేసే విధంగా అధికారుల ప్రోత్సాహం కనిపించడం లేదనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ-నామ్ ద్వారా కొనుగోళ్లు కూడా ఇతర మార్కెట్ కమిటీలకు విస్తరించలేదు.

ఈ-విక్రయాలు జరగడం లేదు



రాష్ట్ర ప్రభుత్వం రెండున్నారేళ్ల క్రితం ఈ-ఫామ్ మార్కెటింగ్ ద్వారా విక్రయాలు చేయాలని చెప్పడంతో అన్ని మార్కెట్ కమిటీల పరిధిలో ప్రారంభించామె. కానీ ఉత్పత్తులను ఎవరూ కొనుగోలు చేయలేదు. దీనిపై అన్ని కమిటీల్లో రైతులకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసాము. ప్రస్తుతం విక్రయాల కార్యక్రమం నిలిచిపోయింది. అలాగే ఈ-నామ్‌లో కొనుగోళ్లు కొత్తపేటలో మాత్రమే జరుగుతున్నాయి.

- కె.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి.

ఆరోగ్య సురక్షలో ప్రజల వద్దకే వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

ప్రజాశక్తి-కాకినాడ, కరప

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. ప్రభుత్వం ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పేద ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తోందని ఆయన అన్నారు. సోమవారం కాజూలూరు మండలం గొల్లపాలెంలోని పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి వేణు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు.-ఈ సంద్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరినీ తమ వారిగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రణాళికాయుతంగా పని చేస్తున్నట్టు తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్‌తో పాటు వివిధ స్పెషలిస్టు వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ రిఫరల్, బ్లడ్ టెస్ట్, బిపి, సుగర్ పరీక్షలు, ఫార్మసీ, న్యూట్రిషన్ కౌన్సిలింగ్ తదితర సేవలు అందిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇంట్లో ఎవరికైనా బాగోపోతే వారి పిల్లలో, బంధువులో ఆసుపత్రికి తీసుకెళ్తారని అదే ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితి పేదలకు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడాలేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, విజయవంతంగా అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం సర్పంచ్ ప్రసన్న మౌనిక, జెడ్‌పిటిసి సుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి, తహశీల్దారు సాయి సత్యనారాయణ, ఎంపిడిఒ రత్న రాజు పాల్గొన్నారు.

కరప మండలం సిరిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. గ్రామ సర్పంచ్ నున్న సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు చింత ఈశ్వరరావు, ఎంపిటిసి ధనలక్ష్మి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పెద్దాపురం మండలం ఆర్‌బి.కొత్తూరులో నిర్వహించిన శిబిరాన్ని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సర్పంచ్ అడ్డాల మరియమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టివి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, ఎంద్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి కిట్టయ్య చౌదరి, గోలి రామకృష్ణ, జయ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ : విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అధికారంలో రాకముందు ప్రభుత్వ విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రభుత్వ విద్యారంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని చెప్పిన పాలకులు నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంజయ్, ఆదర్శ కార్తీక్, జయరాం, మేఘన పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి వారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ ఎ.రమణా రెడ్డి, కెఎస్ఇజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, డిపిఒ ఆర్.విక్టర్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను విని, సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 374 అర్జీలు వచ్చాయి.

దళితులపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని కోరుతూ త్వరలో భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. సోమవారం కాస్మోపాలిటన్ క్లబ్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం దళితులకు పథకాలను రద్దు చేసిందని, ఆ పార్టీలో దళితులకు స్థానం లేకపోగా ఉన్న వారిని అవమానాల పాలు చేస్తోందన్నారు. దళితుడు సుబ్రహ్మణ్యంను హత్య చేసిన ఎంఎల్‌సి అనంత బాబు బెయిల్ రద్దు చేసి జైల్లో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పిట్టా వరప్రసాద్, సిపిఐ నాయకుడు తోకల ప్రసాద్, టిడిపి మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, కొండ్రు మురళి, అధికార ప్రతినిధి రాజేష్, మాజీ ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నరాల శివ, మోకా ఆనంద సాగర్, కాశి నవీన్ కుమార్, తలారి వెంకటరాజు, మాకిరెడ్డి భాస్కర్ గణేష్, పప్పు దుర్గా రమేష్, చొల్లంగి వేణుగోపాల్, నక్కా ఆనంద్ బాబు, కెఎస్.జవహర్, సిపిఐ నాయకులు తాటిపాక మధు, జనసేన నేత పిట్టా జానకి రామారావు, బట్టు లీల, బండి సుజాత, బోడపాటి మరియ పాల్గొన్నారు.

భువనేశ్వరిపై డిప్యూటీ సిఎం వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-కాకినాడ

డిప్యూటీ సిఎం నారాయణస్వామి నారా భువనేశ్వరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు సుంకర పావని ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనేశ్వరి గురించి ఎలా పడితే అలా మాట్లాడితే ఉరుకోబోమన్నారు. వైసిపి అధికారంలోకి రావటానికి తల్లి, చెల్లిని పాదయాత్ర చేయించి ఆనక పార్టీ నుంచి బైటకు తోసిన చరిత్ర అందరికీ తెలిసిన విషయమేనన్నారు.

ఇవిఎంల తనిఖీ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న ఇవిఎంల తొలి దశ తనిఖీ ప్రక్రియను సోమవారం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఎన్నికల, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి ఈ తనిఖీ ప్రక్రియ చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ ప్రక్రియను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నామని బెంగళూరుకు చెందిన బెల్ కంపెనీ ఇంజనీర్ల బృందం సమక్షంలో 20 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ పి.త్రినాథ్, డిఆర్‌డిఎ పిడీ కె.శ్రీరమణి, ఆర్‌డిఒ ఎస్‌వివి.సత్యనారాయణ, పట్టణ తహసీల్దార్ పివి.సీతాపతిరావు, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

పెద్దాపురం సిఐగా రవికుమార్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సిఐగా వై.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ క్రైమ్ విభాగం నుంచి పెద్దాపురం సిఐగా బదిలీపై వచ్చారు. ఆయన గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు.

20న పెద్దాపురం మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ తెలిపారు. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని 23 గ్రామాలకు సంబంధించి సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు. మండల పరిషత్ సభ్యులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

చంద్రరావుకు వైసిపిలో సముచిత స్థానం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

వైసిపిలో చేరిన టిడిపి సీనియర్ నాయకులు మన్యం చంద్రరావుకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సోమవారం చంద్రరావుకు పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో రాజకీయ అనుభవం కలిగిన మన్యం చంద్రరావు సేవలను పార్టీకి వినియోగించుకుని సామర్లకోట పట్టణంలో త్వరలో సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా



కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు ప్రాంతంలో సుమారు 500 ఎకరాల్లో సాగునీరు లేక పంట పొలాలు బీటలు వాడుతున్నాయని ఆ ప్రాంతానికి చెందిన రైతులు తాళ్ళరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు సూరంపూడి శ్రీనివాస్, బాదం ఏడుకొండలు, రాయుడు వీర్రాజు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో మెయిన్ కాలువ కింద రెండెకరాలు, చింతాబోదు కింద 120 ఎకరాలు, పెదమాడి కాపుల బోదు కింద 180 ఎకరాలు సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలు ఈనిక దశలో ఉండగా తొలకరిలోనే నీటి ఎద్దడి రావడం రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. 20 రోజుల నుంచి ఉన్న పరిస్థితిని అధికారులకు తెలియజేసిన నేటికీ ఎటువంటి చర్యలు తీసకోలేదన్నారు. నీటి ఎద్దడి సమయంలో ఒఎన్‌జిసి పైపులైన్ ద్వారా గ్రాంటు ప్రాంతానికి సాగునీరు అందించి అధికారులు తక్షణ చర్యలు చేపట్టేవారని, కానీ ఆ పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ఒఎన్‌జిసి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వెంటనే సాగునీరు పైప్‌లైన్ ద్వారా తరలించాలని కోరారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, రైతులు పిల్లి శ్రీను, వాసంశెట్టి కృష్ణ, పి.భైరవమూర్తి, పితాని శ్రీను, బాదం సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పలువురికి జెడ్‌పిటిసి 'పరిమి' పరామర్శ



పరామర్శిస్తున్న వైసిపి నేత పరిమి బాబు

ప్రజాశక్తి-గండేపల్లి

పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, వైసిపి నేత పరిమి బాబు సోమవారం పరామర్శించారు. యల్లమిల్లిలో సీనియర్ నాయకులు పోకల వెంకట్రావు అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని, కె.నాయకంపల్లిలో సర్పంచ్ భర్త మలిరెడ్డి కాశీ విశ్వనాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారి వెంట ఎన్‌టి.రాజపురం ఉప సర్పంచ్ పరిమి రాజు, బిక్కిన మున్నిబు తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'



నెగ్గాక.. మనం ఎన్ని రూ.కోట్లు ప్రతిఫలంగా ఇచ్చుకోవాలో.. ఏమో..?



స్కూల్ గ్రౌండ్‌లో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

పాఠశాలలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట జిల్లా పరిషత్ బాలికల పాఠశాల తరగతి గదిలో పాములు హల్చల్‌పై వివిధ పత్రికలో వచ్చిన కథనాలపై ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య స్పందించారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌ను పరిశీలించారు. హైస్కూల్ హెచ్ఎం మీనా మాధురిని ప్రశ్నించారు. దీనిపై సత్వర చర్యల్లో భాగంగా వైస్‌చైర్మన్ జాన్ మోజెస్ సహకారంతో జెసిబిని ఏర్పాటు చేసి హైస్కూల్‌లో పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. హైస్కూల్ ప్రహరీ గోడకు చుట్టుపక్కల ఉన్న తుప్పలను తొలగించి విష సర్పాలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాలిక కుసుమ చంటిబాబు, విద్యా కమిటీ చైర్మన్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -కరప

వివిధ గ్రామాల్లో, పాఠశాలలోని బాల్య వివాహాల నిరోధక చట్టంపై అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు అంగన్వాడీ టీచర్లు సోమవారం అవగాహన కల్పించారు. కరప, వాకాడ జెడ్‌పి హైస్కూల్లో బాల్యవివాహాలు, బాలల చట్టాలపైన ఐసిడిఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ అడబాల సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలల హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని, లింగ వివక్షత రహిత ఆదరణ, బాల్యవివాహాలు, బాలలను లైంగిక హింసల నుంచి రక్షించేందుకు ప్రజలు చైతన్యం అవ్వాలన్నారు. ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు, పి.సునీల్, కె.అన్నపూర్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన 'బాబుతో నేను'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి

టిడిపి అధినేత చంద్రబాబు ఐదు కోట్ల ప్రజల ఆస్తి అని, ఆయనకు ఏదైనా జరిగితే ప్రజలు తట్టుకోలేరని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంత లక్ష్మి అన్నారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి, రాఘవేంద్రపురంలో సోమవారం బాబుతో నేను 'కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. వైసిపి కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ హితవు పలికారు. ఉప్పాడ గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు వివరించారు 9261292612 నెంబుకు మిస్డ్ కాల్ ఇచ్చి చంద్రబాబుకు మద్దతు తెలపాలని కోరారు.

ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రైతు భరోసా కేంద్రాలను కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుర్రప్పాలెంలో సోమవారం ఆయన ఆర్‌బికెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ సలహాలు కావాలన్నా వ్యవసాయంలో మెలకువలు, మందులు, పిండి కోసం, రైతు భరోసా పడకపోయినా, పంట నమోదు, పంట నష్టంలాంటివి నమోదు చేసుకోవాలన్న రైతులు ఈ ఆర్‌బికె కేంద్రాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. బాల్య వివాహాలు చేయకూడదని బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలకు ఎవరూ కూడా సహకరించవద్దని ఒకవేళ ఎవరికైనా సమాచారం వస్తే 1098కి కానీ బాల్యవివాహాలు నిషేధిత అధికారులకు కాని లేక రక్షణ శాఖకు కానీ సమాచారం అందించాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ అధికారి ఎం.పూర్ణిమ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నాయకులు పడాల విష్ణు, ఎంపిపిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

దాత కందులకు ఎంఎల్‌ఎ ప్రశంస

ప్రజాశక్తి-గండేపల్లి

కందుల చిట్టిబాబు దానగుణం కలిగిన వ్యక్తి అని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ప్రశంసించారు. కొనియాడారు. జడ్.రాగంపేటలో ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవంలో సోమవారం ఎంఎల్‌ఎ చంటిబాబు, జెసి ఇలాక్కియా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చంటిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే ఏ గ్రామంలోనూ ఒకే చోట సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మించలేదని, రూ.50 లక్షల విలువైన 50 సెంట్ల భూమిని దానం చేయడం కందుల కొండయ్య దొర, చిట్టిబాబు కుటుంబాలకే చెల్లిందన్నారు. గ్రామ సర్పంచ్ కందుల చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలను ఎంఎల్‌ఎ, జెసి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొరబాబు, జెడ్‌పిటిసి పరిమి వెంకట లక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, అడబాల ఆంజనేయులు, దొమ్మ శ్రీను, ఒబిని వీరబాబు, కందుల గోవింద చౌదరి, కంటే సురేంద్ర, బుజ్జి, యువ నాయకులు కందుల విజయ్ కందుల వినయ్, పాల్గొన్నారు.

ఐడియల్ కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

ఐడియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు జీవితాన్ని కూడా బోధిస్తారని సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక విద్యుత్ నగర్ ఐడియల్ డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కళాశాల యాజమాన్యం ప్రిన్సిపల్ కరెస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, సెక్రెటరీ పిఎస్ఎస్ కిరణ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ద్వారంపూడి ప్రారంభించారు. అనంతరం బిఎస్‌సి ఫుడ్ టెక్నాలజీ, రోబో టెక్, ఫిషరీస్, అగ్రికల్చర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను సందర్శించారు.

'జగన్‌ను మళ్లీ సిఎంను చేయాలి'

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని మామిడాడలో సోమవారం ఆయన అనుచరులు శరణం అప్పిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్‌జీ, గుల్ల ఏడుకొండలు, గపూర్, తులా రాము, పలికెల గంగరాజు, కరుటూరి శ్రీనివాస్, తోట బాబ్జి, ఒబిలి రాజు, అడబాల సుబ్బారాయుడు, పరిమి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందనతో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజలు ఎదుర్కొనే స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్ వంటి మౌలిక సదుపాయాల కల్పన, రహదారి పక్కన అవరోధంగా ఉన్న చెట్లను తొలగించడం వంటి అంశాలపై పలువురు ఫోన్ ద్వారా కమిషనర్ నాగ నరసింహారావుకు తమ సమస్యలను విన్నవించారు. అనంతరం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 22 మంది దరఖాస్తులు అందజేశారు. వీటిపై సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

'విజన్ ఉన్న నాయకుడు సిఎం జగన్'

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సిఎం వైఎస్.జగన్ రాష్ట్ర అభివృద్ధిపై విజన్ ఉన్న నాయకుడని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోటలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 12న పెద్దాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్ పర్యటనను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విజన్ 2020, విజన్ 2046 అని చెబుతూ ప్రజలను మోసం చేసే నాయకుడు జగన్ కాదన్నారు. జగనన్న ఇళ్ల ద్వారా 2800 కుటుంబాలకు గృహ నిర్మాణాలు జరగగా వెయ్యి మంది ప్రజలు నివసించే వీలున్నందున వారికి అవసరమైన రీతిలో స్థానికంగా మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ సరఫరాకు సబ్ స్టేషన్ నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకులు, పార్కులు ఏర్పాటు చేయాలని ముందుగానే సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రణాళికలు రూపొందించారని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో ఆవాల రాజేశ్వర లక్ష్మీనారాయణ, నక్కంటి సాయి ప్రసాద్, నవర బాబ్జి, మస్తం చంద్రరావు, మద్దాల శ్రీనివాస్, మేక శ్రీనివాసు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, బొద్దు తులసి మంగతాయారు, ఆవాల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మూడు ముళ్ల బంధనంలో బాల్యం

- యథేచ్ఛగా బాల్య వివాహాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మూడుముళ్ల బంధంలో 'బాల్యం' చిక్కుకుంటోంది. పూర్తి పరిపక్వత లేని వయసులో పసి మొగ్గలకు పెళ్లిళ్లు జరుపుతున్నారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలు, మూఢనమ్మకాలు, అభద్రతాభావం, అనాలోచిత నిర్ణయాలు తదితర కారణాల రీత్యా ఆడి, పాడే వయసులోనే చిన్నారుల జీవితాలను సంసార ఊబిలోకి నెట్టేస్తున్నారు. బాల్య వివాహాలపై నిషేధమున్నా వాటిపై అవగాహన కల్పిస్తున్నా ఈ పెళ్లిళ్లు ఆగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువగా వీటి ప్రభావం ఉంది. జిల్లాలో ఏటా 60 నుంచి 90 వరకు ఈ వివాహాలు లోలోపల జరుగుతున్నట్టు సమాచారం. ఇటీవల కోటనందూరు మండలం ఎస్ఆర్.పేటలో పదహారేళ్ల బాలికకు, సామర్లకోట మండలం వేట్లపాలెంలో 17 ఏళ్ల బాలికకు వివాహం జరుగుతుండగా ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందడంతో తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలుపుదల చేశారు. రౌతులపూడి మండలం పి.చామవరంలో పదహారేళ్ల బాలికకు, ఆత్రేయపురం మండలం ర్యాలిలో 14 ఏళ్ల బాలికకు, ఆలమూరు మండలం పెద్దపల్లిలో 15 ఏళ్ల బాలికకు, మడికిలో 16 ఏళ్ల బాలికకు బాల్యవివాహాలు జరుగుతుండగా అధికారులకు సమాచారం అందడంతో వాటిని అడ్డుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏదొక మూలన బాల్య వివాహాలు జరుగుతుండగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు వివాహాలను అడ్డుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. 2016-17లో జిల్లాలో 66 వివాహాలను, 2017-18 లో 57, 2019 నుంచి 2021 వరకూ 317, గతేడాది 91 వివాహాలను అడ్డుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 57 వివాహాలను నిలుపుదల చేసారు. వారి దృష్టికి రాని అనేక వివాహాలు నిత్యాం జరుగుతున్నా అధికారులు సరిగా స్పందించడం లేదని ఆరోపణలున్నాయి.



శారీరక, మానసిక సమస్యలు వస్తాయి

బాల్యంలో వివాహాలు చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు వస్తాయి. గర్భం ధరించినప్పుడు బిడ్డ ఎదుగుదలలో లోపం, రక్తహీనత సమస్యలు వచ్చే ఆవకాశం ఉంటుంది. పుట్టేబిడ్డ ఆరోగ్యంగా లేకపోవడం లాంటి సమస్యలూ ఉంటాయి. శారీరక, మానసిక ఎదుగుదల కూడా లోపిస్తుంది. భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్యం పాలవుతారు.

- డాక్టర్ కె.అనిత, గైనిక్ వైద్యురాలు, జిజిహెచ్ ఆర్‌ఎంఓ.



రౌతులపూడిలో కౌన్సిలింగ్ ఇస్తున్న ఐసిడిఎస్ అధికారులు

సమాజం మారుతున్నా..

సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా బాల్య వివాహాలు ఆగడం లేదు. పెళ్లి పేరుతో 12-16 ఏళ్లకే బాలికాలు పుస్తెల భారం మోయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ ఏడాది అక్టోబరు వరకూ, వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కొన్ని ముహూర్తాలుండటంతో జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, తదితర మండలాలతో బాటుగా కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలో పలు ప్రాంతాల్లో కొందరు తల్లిదండ్రులు బాల బాలికల జీవితాలను బుగ్గిపాలు చేసేందుకు పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు ఆర్థిక పరిస్థితులు, మరోవైపు నిరక్షరాస్యత, అవగాహన లేమి, తదితర కారణాల వల్ల ఏటా పదుల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు.

ముందస్తు అవగాహన తప్పనిసరి

పసితనం, తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పలేని బాలికలు పెళ్లిళ్లలకు ఒప్పుకుంటున్నారు. ఈ తరుణంలో వివాహాలకు ముహూర్తాలు నిశ్చయించుకుని పెళ్లి పీటలపై కూర్చున్న సమయంలో అధికారుల జోక్యంతో పెళ్లిళ్లు ఆగిపోతున్నాయి. అప్పటికే కట్నకానుకలు ఇచ్చేయడం, పెళ్లి భోజనాలు ఏర్పాట్లు చెసుకున్నాక పెళ్లి నిలిచిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురై మానసికంగా కుంగిపోతున్న సంఘటనలు సైతం కోకొల్లలు. అయితే అధికారులు ముందు నుంచే గ్రామాల్లో బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కల్పిస్తే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడవచ్చు. బాల్య వివాహాలు ఆరికట్టడంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్‌లు ప్రధాన పాత్ర వహించాల్సి ఉంది.

బాల్య వివాహ నిరోధక చట్టం 1929లో వచ్చింది. కానీ చట్టం అమలులో లోపాలను సవరిస్తూ 2006లో మరింత పటిష్ఠం చేస్తూ అదనంగా రెండేళ్ల జైలు శిక్షను చేర్చింది. దీంతో బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తితో పాటు వధూవరుల తల్లిదండ్రులు, వివాహం చేసిన పెద్దలు, పెళ్లికి సహకరించిన వారితో పాటు పెళ్లి జరిపించిన పంతులు, హాజరైన అందరిపై కేసులు నమోదు చేసే ఆవకాశం ఉంది. బాల్య వివాహాలపై విఆర్ఒ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తహశీల్దార్, ఎంపిడిఒ, సిడిపిఒ, ఆర్‌డిఒ కలెక్టర్, పోలీసులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వవచ్చు.

కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి ఎన్నికైన ముగ్గురు పార్టీ నాయకులను సోమవారం ఘనంగా సన్మానించారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపికైన మట్టా శివప్రసాద్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్సులుగా ఎంపికైన ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మట్టా శివప్రసాద్, ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు మాట్లాడుతూ తమకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో చోటు కల్పించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి తగు చర్యలు చేపట్టి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, నగర అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజు, ఎఐసిసి సభ్యుడు మల్లిపూడి రాంబాబు, నియోజవర్గ ఇన్చార్జిలు కోలా ప్రసాద్ వర్మ, మారోతు శివ గణేష్, ఉమ్మిడి వెంకట్రావు, మేడిది శ్రీను, తుమ్మల దొరబాబు, కుక్కల పోతురాజు, సూర్య ప్రకాష్ రావు, బత్తిన లలిత, బుర్ర పద్మనాభం, అబ్బారెడ్డి, జ్యోతి, నారయ్య, పరమేష్ పాల్గొన్నారు.



రాష్ట్ర కమిటీ నాయకులను సన్మానిస్తున్న స్థానిక నాయకులు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

జగన్ పాలనకు చరమగీతం తప్పదు

ప్రజాశక్తి - గోపాలపురం

వచ్చే ఎన్నికల్లో పులివెందులతోపాటు, రాష్ట్ర వ్యాప్తంగా జగన్ పాలనకు చరమగీతం తప్పదని మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరావు, జడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని వాదాలకుంట గ్రామంలో టిడిపి నాయకులు దుగ్గిరాల రాంబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు తొలగి ఆయురారోగ్యాలతో జైలు నుంచి బయటకు రావాలని గ్రామ దేవతకు 101 బిందెలతో అభిషేకం చేశారు. గ్రామంలో రూ.2 లక్షలతో ఎన్‌టిఆర్ విగ్రహం, షెడ్డు ఏర్పాటు చేసిన ఆచంట నాగేశ్వరరావు, ఆచరణ సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకో పరిపాలన పోతుందని వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే సైకో జగన్ సాక్షాదారం లేని కేసులు పెట్టి చంద్రబాబును జైలు పాలు చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమన్నారు.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. వీరికి వారు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు ఉండవల్లి బోసు, జె.బుల్లిఅబ్బులు, కులుకులూరి రవి, నందమూరి సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుతో నేను కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గంగంపాలెం గ్రామంలో బాబుతో నేను కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఉంగరాల రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం అన్యాయం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రశ్నించినందుకే చంద్రబాబును దుర్మార్గంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జ్ పిల్లా చంటిబాబు, గ్రామ టిడిపి అధ్యక్షులు నూకరాజు, బుత్ ఇన్‌ఛార్జ్ సాలాపు అప్పారావు, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న నాయకులు

కేశవరం అభివృద్ధికి కృషి

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని కేశవరం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం గ్రామంలో సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, ఎంపిపి ఉండమట్ల వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, జడ్‌పిటిసి సభ్యులు కురుపూడి భవానిలతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం, ఎంపిపి నిధులు రూ.106.81 కోట్లతో నిర్మించిన 9 సిసి రోడ్లతో పాటు ఫిషర్ మ్యాన్ యార్డు, ఎస్‌సి, ఒసి శ్మశానవాటికల వద్ద నిర్మించిన జల్లు స్నానం, వత్సవాయి చెరువు వద్ద నిర్మించిన దోబీ ఘాట్‌లను ఆయన ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.143.06 కోట్లతో నిర్మించనున్న ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు, ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మేజర్ పంచాయతీలు ఏడిద, ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం రైతులు ఎంఎల్‌సి తోటను ఘనంగా సత్కరించారు. తొలుత రైల్వే గేట్ సమీపంలో నిర్మించిన కాటన్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు తోట సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలో ఆహ్వానించారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, గారపాటి సౌజన్య, ఎంపిటిసి సభ్యులు అన్నందేవుల కష్టారావు, ఆర్‌బికెల మండల చైర్మన్ అన్నందేవుల సూర్యచంద్రరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, పెదపాటి ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ ఐదం రాజు, వివిధ శాఖల అధికారులు ఎజి.రామారావు, భాగ్యరాజు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్‌సితోటను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

విశాఖలోని అక్కయ్యపాలేనికి చెందిన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 27వ శాఖను కాకినాడలో సోమవారం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకుల సమాఖ్య అధ్యక్షులు, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర ముఖ్యఅతిథిగా, కాకినాడ జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా కో-ఆపరేటివర్ అధికారి బికె.దుర్గాప్రసాద్ గౌరవఅతిథిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంకుల సమాఖ్య కార్యదర్శి, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు, మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎంఆర్‌కె.రాజు ప్రత్యేక అతిథులుగా హాజరై శాఖలోని వివిధ విభాగాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చిట్టూరి రవీంద్ర మాట్లాడారు. సహకార బ్యాంకులతోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. చిన్న, మధ్య తరహా ప్రజల అవసరాలకు సహకార బ్యాంకులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కాకినాడ జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి బికె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాల ఖాతాదారుల అవసరాలను తీరుస్తూ దినదినాభివృద్ధి చెందుతున్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు దేశంలో రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కో -ఆపరేటివ్ రంగంలో సాంకేతికపరంగా అభివృద్ధి చెందిన బ్యాంకుల్లో కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందన్నారు. అధునాతన పద్ధతుల్లో ఖాతాదారులకు సేవలను అందిస్తుందన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ 25 ఏళ్లుగా రాష్ట్రంలో వివిధ జిల్లాలో 26 శాఖలను ఏర్పాటు చేశామన్నారు. రజతోత్సవ వేడుకల్లో భాగంగా 27వ శాఖను కాకినాడలో ప్రారంభించామన్నారు. 1,707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల వాటా ధనంతో ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు నేడు 17,310 సభ్యులతో రూ.30 కోట్ల వాటా ధనంతో రూ.130 కోట్ల సొంత నిధులతో పటిష్ఠంగా ఉందన్నారు. బ్యాంకు ప్రారంభమైన మొదటి సంవత్సరం నుంచే డివిడెండును ఖాతాదారులకు చెల్లిస్తున్నామని తెలిపారు. 200 మందికి పైగా సిబ్బందిని కలిగి రూ.807 కోట్ల డిపాజిట్లు, రూ.507 కోట్ల రుణాలతో సమారుగా రూ.1,314 కోట్ల లావాదేవీలను నిర్వహిస్తుందన్నారు. బ్యాంకు డిపాజిట్లకు ఆర్‌బిఐ వారి డిఐసిజిసి ద్వారా బీమా రూ.5లక్షల వరకూ వర్తిస్తుందన్నారు. తమ బ్యాంకును ఆదరించాలని కాకినాడ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, డైరెక్టర్లు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్‌తో నన్నయ ఎంఒయు

ప్రజాశక్తి - రాజానగరం

ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్‌తో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని (ఎంఒయు) కుదుర్చుకుంది. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్‌తో ఎంఒయు మరియు వర్క్ షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు, ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ అసెస్మెంట్ యూనిట్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల అరోహి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ కోవిడ్ సంక్షోభం తరువాత ఆన్‌లైన్ లెర్నింగ్ ఎక్కువగా అందుతుందన్నారు. జాతీయ విద్యావిధానం 2020 అమలులో దేశంలోని ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. దీనిలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కీలక పాత్రను పోషిస్తుందని చెప్పారు. నూతన విద్యా విధానాలతో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. విసి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా ఈ ఎంఒయు కుదుర్చుకున్నామన్నారు. ఇన్ఫోసిస్ రిసోర్స్‌పర్సన్స్ డాక్టర్ ఎస్. మీనాక్షి, సహన కుమార స్వామి నూతన టెక్నాలజీకి సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల అరోహిలు ఎంఒయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్య జెవిఆర్.మూర్తి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఐ.క్యూ.ఎ.సి. డైరెక్టర్ డా.వి.పెర్సిస్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.కెజియారాణి, డాక్టర్ లత, విశ్వవిద్యాలయ అధికారులు, అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న యూనివర్శిటీ, ఇన్ఫోసిస్ అధికారులు

యానాం వార్తలు

యానాం జిప్‌మెర్‌లో వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి - యానాం

త్వరలో ప్రారంభం కానున్న 100 పడకల జిప్‌మెర్ మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్లో వాలంటీర్ల సేవలు వినియోగించుకోనున్నట్లు పుదుచ్చేరి జిప్మెర్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) డాక్టర్ కృష్ణగోపాల్ గోయల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి కొంత సమయం పట్టనున్న నేపథ్యంలో స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చే వలంటీర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిప్‌మెలో ఆరు నెలల పాటు సేవలందించేందుకు అవకాశముంటుందన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణలో అనుభవం, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సమయపాలన పాటించని ప్రభుత్వ ఉద్యోగులు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ప్రభుత్వ అధికారులు బొత్తిగా సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు అయితే కార్యాలయానికి వస్తున్నారో లేదో అనుమానమే. మరికొందరైతే సమయానికి రాకపోగా పనిచేయకుండా రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామంటే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని సమాధానం ఇస్తున్నారంటున్నారు.



కాకినాడ శాఖను ప్రారంభిస్తున్న రవీంద్ర

కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ప్రారంభం

కాకినాడ : విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా ఉన్న కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు తమ 27వ శాఖను కాకినాడలో సోమవారం ప్రారంభించింది. రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంకుల సమాఖ్య అధ్యక్షుడు మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర ముఖ్య అతిథిగా, జిల్లా కోఆపరేటివ్ అధికారి బి.కె.దుర్గాప్రసాద్, రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంకుల సమాఖ్య కార్యదర్శి సిహెచ్. రాఘవేంద్రరావు, మహారాజా కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎంఆర్‌కె.రాజు బ్యాంకు శాఖను, వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టూరి రవీంద్ర మాట్లాడుతూ సహకార బ్యాంకులతోనే దేశ ఆర్థిక పురోగాభివృద్ధి సాధ్యమన్నారు. చిన్న, మధ్యతరహా ప్రజల అవసరాలకు సహకార బ్యాంకులు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాల ఖాతాదారుల అవసరాలను తీరుస్తూ, దినదినాభివద్ధిని చెందుతూ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు దేశంలో రానున్న కాలంలో మరింత అభివద్ధిచెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, డైరెక్టర్లు, సిఇఒ కె.శ్యామి కిషోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పాత్ర కీలకం

ఏలేశ్వరం : గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సాయం అందించడంలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమైనదని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన సొంత ఖర్చులతో రికార్డు బుక్స్ కొనుగోలు చేసి ప్రత్తిపాడు మండలంలోని ఆశా కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర బాలికలకు, మహిళలకు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కలిగించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపిపి గొళ్ల క్రాంతి సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి తోట ఆక్రమించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజోలు

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో తన కొబ్బరి తోటను ఆక్రమించారని మొగలికుదురుకు చెందిన కూర్మా నాగేశ్వరరావు సోమవారం ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. రాజోలు మండలం పాలగుమ్మిలో సర్వే నెంబర్ 26/1లో తన మేనత్త కోట నాగరత్నంకు 2.47ఎకరాల కొబ్బరి తోట ఉందన్నారు. ఆమె అమెరికాలో ఉండటంతో పంటపొలాలకు తానే సంరక్షకుడిగా ఉంటున్నానని తెలిపారు. ఇటీవల తాను పాలగుమ్మి కొబ్బరి తోటలో దింపు తీయించేందుకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన చుట్టుగుళ్ళ సత్యనారాయణ అడ్డుకున్నాడని తెలిపారు. తన మేనత్తకు చెందిన కొబ్బరి తోటలో చుట్టుగుళ్ల సత్యనారాయణ 40 సెంట్ల భూమికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించి, ఆక్రమణలను అరికట్టాలని ఎస్‌పి, కలెక్టర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

వెంకన్న సన్నిధిలో అజయ్ కల్లాం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని సోమవారం మాజీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు



చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు



ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

సంధిపూడిలో 'గడప గడపకూ...'

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని సంధిపూడిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, తోరాటి రాంబాబు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్పందనలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో సత్వర పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది జవాబుదారీతో కూడిన సేవలు అందించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో పూర్తి స్థాయిలో నాణ్యతతో కూడిన విధంగా ఉండాలన్నారు. ఏ ఒక్క అర్జీ రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలన్నారు. 17 వినతులు స్వీకరించామన్నారు. స్పందనలో కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, సిటీ ప్లానర్ జివిఎస్ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.